విజ్ఞానయాత్రలో జిల్లా రైతులు

విజ్ఞానయాత్రలో పాల్గొన్న రైతులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 18 : అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ కళాశాలలో అగ్రిటెక్-2024 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో రైతులకు శిక్షణ, విజ్ఞానయాత్ర కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆత్మ జిల్లా పథక సంచాలకులు తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో 53 మంది రైతులు, సంబంధిత అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

కొనసాగుతున్న పనులు

ధర్పల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని వాడి గ్రామ బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. వాడి గ్రామ వాగుపై పురాతన బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొనే వారు. గ్రామస్తులు ఈ విషయాన్ని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఈ పనులకు ఇటీవల శిలాఫలకం ప్రారంభించగా.. రూ. 9. 50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో వాడి, హోన్నాజీపేట్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులను త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

నగరంలో యువకుడి దారుణ హత్య

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో శ్రావణ్‌కుమార్ (ఫైల్)

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 18: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐదో టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న స్మార్ట్ సిటీ వెంచర్‌లో వాకింగ్‌కు వెళ్లిన పలువురు ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్ (35) ఖలీల్‌వాడిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం శ్రావణ్‌కుమార్ తన ఫోన్‌ను పోగొట్టుకోవడంతో దవాఖానలోని తోటి సిబ్బంది సెల్‌ఫోన్ నుంచి శనివారం రాత్రి 8 గంటల సమయంలో తన భార్యకు ఫోన్ చేసి.. ఇంటికి రావడం ఆలస్యమవుతుందని సమాచారం ఇచ్చాడు. ఆదివారం ఉదయం తన భర్త హత్యకు గురైనట్లు తెలియడంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది. న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న స్మార్ట్ సిటీ వెంచర్‌లో శ్రావణ్‌కుమార్ మృతదేహం కనిపించడంతో నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజా వెంకట్‌రెడ్డితో పాటు నార్త్ రూరల్ సీఐ ఎస్.సతీశ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తలపై వాష్ రూంలో వినియోగించే టాయిలెట్ బేషన్‌తో బలంగా మోది హత్యచేసినట్లు గుర్తించారు. శనివారం రాత్రి సమయంలో హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్యజరిగిన ప్రదేశంలో మృతుడికి సంబంధించిన ద్విచక్రవాహనం (యాక్టివా)తోపాటు కల్లు ప్యాకెట్, మద్యం సీసాలను గుర్తించారు. ఎవరితోనైనా కలిసి మద్యం తాగిన అనంతరం ఏదైనా గొడవ జరిగి, హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతుడికి భార్య షర్వానీ, పాప (7), బాబు(4) ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఐదో టౌన్ ఎస్సై అప్పారావు తెలిపారు.

ఆర్యవైశ్య గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'దిక్సూచి'

విద్యార్థులను అభినందిస్తున్న ఆర్యవైశ్య గ్రాడ్యుయేషన్ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 18 : జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆర్యవైశ్య గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దిక్సూచి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యవక్తగా తిరునగరి శ్రీహరి హాజరై తల్లిదండ్రుల విలువలను వివరించారు. విద్యార్థి తన జీవితంలో రోల్‌మోడల్‌గా తీసుకోవాల్సిన వ్యక్తులు స్వామి వివేకానంద, ఏపీజే అబ్దుల్ కలాం తదితరుల జీవితచరిత్రను వివరించారు. జీవితంలో విజయం సాధించడానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి బచ్చు పురుషోత్తం గుప్తా, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు మహంకాళి విజయ్‌కుమార్, అడ్‌హక్ కమిటీ మాజీ ఎన్నిక అధికారి బల్దాస్‌గుప్తా, ఆర్యవైశ్య గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూట్ల నవీన్, డాక్టర్ గందె శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన బస్సు

- ఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి

నాగరాజు (ఫైల్)

ప్రమాదానికి కారణమైన బస్సు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 18 : జిల్లాకేంద్రంలోని కోటగల్లీ ప్రాంతంలో ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి వచ్చి ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగారం ప్రాంతంలో నివాసం ఉండే క్యాసారపు నాగరాజు (57) వైద్యశాఖలో ల్యాబ్‌టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం స్కూటీపై పూలాంగ్ నుంచి నాగారం వైపు వెళ్తున్నాడు. కోటగల్లీలోని హనుమాన్ ఆలయ సమీపంలో వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్రగాయాలై ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మృతుడి భార్య ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించింది. ఫోర్త్ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో బస్సుడ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహం

భజనలు చేస్తున్న భక్తులు

కోటగిరి, ఫిబ్రవరి 18 : పొతంగల్ మండలం సుంకిని గ్రామంలో అఖండ శివనామ సప్తాహం కొనసాగుతున్నది. ఈ నెల 14వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభమైందని, 20వ తేదీ వరకు కొనసాగనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు పారాయణం, ప్రవచనాలు, పూజలు, భజనలు కొనసాగుతున్నాయి. ముగింపు రోజున అన్నదానం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సిద్ధలింగప్ప మహరాజ్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహరాజ్‌లు ప్రవచనాలు చేస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటన

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 18: బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఉదయం 10 గంటలకు వేల్పూర్ మండల కేంద్రంలో, 11.30 గంటలకు కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఘనంగా పెద్దమ్మ పండగ

ధర్పల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని సీతాయిపేట్‌లో పెద్దమ్మ పండుగను రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. శనివారం యజ్ఞం అన్నదానం నిర్వహించగా.. ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు సైతం పండుగలో పాల్గొన్నారు. అనంతరం వన భోజనాలకు వెళ్లారు.

అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిరికొండ, ఫిబ్రవరి 18 : విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలను నిర్వహించగా.. సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అబాకస్ వివిధ విభాగాల్లో టి.శివాణి, ఎన్.కార్తీక, కె.అనన్య పాటిల్, వి.సాధ్వి, వేదిక్ మ్యాథ్స్ విభాగంలో పి.యశ్వంత్, వైశ్విక, పి.నవ్యశ్రీ ప్రతిభ కనబర్చారు. వీరితో పాటు జి.శ్రీకాంత్, ఎన్.అవంతిక, కె.నిత్యశ్రీ, వై.సంకేత్, టి.దీక్షత ప్రోత్సాహక బహుమతులు పొందారు. జిల్లాకేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవనంలో శనివారం సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవంలో విద్యార్థులను డీఈవో దుర్గాప్రసాద్, ఎస్.జయసింహాగౌడ్ అభినందించి, జ్ఞాపికలు అందజేశారు.

పేకాటస్థావరాలపై దాడులు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 18 : నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట స్థావరాలపై ఎస్సై ప్రవీణ్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నాందేవ్‌వాడలో ఓ పేకాట అడ్డాపై దాడి చేసి విజయ్‌కుమార్, జ్ఞానేశ్వర్, విజయ్, హన్మంతును అదుపులోకి తీసుకొని, రూ.10,200 నగదు సీజ్ చేశారు. అరుంధతినగర్‌లోని మరో పేకాటస్థావరంపై దాడి చేసి లింగం, సాయిలు, నగేశ్, నరేశ్ అనే నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.2,170 నగదును సీజ్ చేశారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. త్రీటౌన్ ఏరియాలో పేకాట ఆడితే 87126 59893 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

22న ఇసుక వేలం

రెంజల్, ఫిబ్రవరి 18: మండలంలో అక్రమంగా తరలిస్తుండగా సీజ్ చేసిన ఇసుకకు ఈనెల 22న మధ్యాహ్నం 12.30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎంఏ ఖలీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నీలా, పేపర్‌మిల్ కాలనీల్లో మూడు టిప్పర్లు, రెండు ట్రాక్టర్ల ఇసుకకు తహసీల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మూడు టిప్పర్లకు రూ.20వేలు, రెండు ట్రాక్టర్లకు రూ.3.వేలు ముందుగా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

ఇందల్వాయి, ఫిబ్రవరి 18 : మల్లాపూర్ మాజీ సర్పంచ్ లోలం సత్యనారాయణను గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఐదేండ్ల పాటు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో యువజన సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

మాక్లూర్, ఫిబ్రవరి 18: ముల్లంగి(బి)లో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వీరేందర్‌రావు తెలిపారు. సోమవారం వివిధ పూజలు, మంగళవారం యజ్ఞం, 21న బుధవారం వేణుగోపాల స్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం చేస్తామని పేర్కొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి

మోర్తాడ్, ఫిబ్రవరి18: మండల దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భాగ్యరెడ్డి వర్మ వర్ధంతిని మోర్తాడ్‌లో నిర్వహించారు. భాగ్యరెడ్డివర్మ 1906లో జగన్‌మిత్ర మండలిని స్థాపించి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను నిర్మూలించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని నేటి సమాజం ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజారాం, బాబూరావు, మామిడి గంగాధర్ పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే సన్మార్గంలో నడవాలి

రుద్రూర్, ఫిబ్రవరి 18 : మండలకేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాలులో మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లిం మతపెద్దలు చిన్నారులకు పలు అంశాలపై ఆదివారం అవగాహన కల్పించారు. చిన్నప్పటి నుంచే చిన్నారులు అల్లాహ్ చూపిన సన్మార్గంపై అవగాహన కలిగి ఉండి, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. సుమారు 200 మంది బాలబాలికలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం చిన్నారులకు పోటీ పరీక్ష నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షరుద్దీన్, తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ముల్తానీ, సదర్ షేక్ మహ్మద్, డివిజన్ స్పోక్స్‌పర్సన్ ఇర్ఫాన్, అబ్దుల్ రహీం, మౌలానా, ఇమామ్ ముస్తీ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కుమారుడి వివాహ వేడుక హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. వివాహానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సీఎంతో పాటు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేడుకలో పాల్గొన్నారు.
– సారంగాపూర్, ఫిబ్రవరి 18

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నల్లవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు వెంకటరమణాగౌడ్, రాజన్న, శ్రీధర్‌గౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాము బీఆర్ఎస్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. – సారంగాపూర్, ఫిబ్రవరి 18

బషీరాబాద్‌లో సర్కిల్ లైట్లు ఏర్పాటు

సర్కిల్ లైట్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 18: జడ్పీటీసీ నిధులతో మండలంలోని బషీరాబాద్‌లో శనివారం రాత్రి ప్రధాన కూడళ్ల వద్ద సర్కిల్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ నిధులను మంజూరు చేసిన జడ్పీటీసీ రాధా రాజాగౌడ్‌కు మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ ధన్యవాదాలు తెలిపారు. వివేకానంద కూడలి వద్ద, కాంబోడ కూడలి వద్ద సైతం సర్కిల్ లైట్ల ఏర్పాటుకు కృషి చేయాలని జడ్పీటీసీని కోరారు.

నీలాలో పోలీస్ పికెటింగ్

రెంజల్, ఫిబ్రవరి 18: మండలంలోని నీలా – నవీపేట ప్రధాన రహదారిపై గతంలో ఏర్పాటు దిమ్మెకు రంగులు వేసిన విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. దీంతో నీలా గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈవిషయం తెలుసుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఇరువర్గాలను పిలిపించుకొని నచ్చజెప్పారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్ నీలాలో ఆదివారం నుంచి పికెటింగ్ ఏర్పాటు చేశారు.

ఇసుక, మొరం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ

మోర్తాడ్, ఫిబ్రవరి18: మండలంలో ఇటీవల ఇసుక, మొరం అక్రమం రవాణా జోరు పెరిగిందని ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుంకెట్ పెద్దవాగు నుంచి కూడా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని అన్నారు. కొందరు పొక్లెయిన్ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ఇసుక, మొరం ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వానికి చలాన్లు చెల్లించి వేబిల్లులు తీసుకుని, ఇసుక రవాణా చేస్తే మండలానికి, గ్రామపంచాయతీకి సీనరేజీ నిధులు వస్తాయని అన్నారు. కానీ సుంకెట్, పాలెం వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన ఇసుకను సీజ్ చేస్తున్న అధికారులు అక్రమంగా పాలెం నుంచి వేబిల్లులు లేకుండా ఇసుక, వరదకాలువ మొరాన్ని తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోతే ఎంపీటీసీల ఫోరం తరపున అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ దుగ్గెన రాజేందర్ పాల్గొన్నారు.

వీడీసీ ఎన్నిక

బాల్కొండ, ఫిబ్రవరి 18: కిసాన్‌నగర్(దుబ్బ) గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తమ్మె కపిల్, ఉపాధ్యక్షుడుగా బొంత రాములు, కోశాధికారిగా జక్క రాజలింగం, కార్యదర్శిగా ర్యాపన్ పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం యాదగిరి, సభ్యులుగా తమ్మె లింగయ్య, అశ్వక్, పిల్లి మహేందర్, కొమ్రె ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 18: ప్రభుత్వ పాఠశాలల్లో చదుతున్న విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఎస్సై మచ్చేందరెడ్డి, పీఆర్డీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని తడ్‌పాకల్ జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన చదువు అందుతోందని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జావిద్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ, కృష్ణ ప్రసాద్, సుధాకర్, గంగాధర్, నరేందర్, రాములు, నాగప్ప, రవి, స్వప్న, సుజాత, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆట వస్తువుల వితరణ

పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

వేల్పూర్, ఫిబ్రవరి 18: మండలంలోని కుకునూర్ ప్రభుత్వ పాఠశాలకు అగిలేటి స్వచ్ఛంద సంస్థ వారు సుమారు రూ.2 లక్షల విలువ గల ఆట వస్తువులను వితరణ చేశారు. ఆదివారం వీటిని పాఠశాలలో ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు

నవీపేట, ఫిబ్రవరి 18: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మొరం రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం ఒక ప్రటకనలో హెచ్చరించారు. కొంతమంది అక్రమార్కులు అనుమతులు లేకుండా రాత్రి వేళలో రెంజల్ మండలం నుంచి ఇసుక రవాణా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోనూ అక్రమంగా మొరం రవాణా చేస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పేర్కొన్నారు.

నేడు శివాజీ విగ్రహావిష్కరణ

బాల్కొండ, ఫిబ్రవరి 18 : ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు యువజన సంఘ సభ్యులు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో హిందువులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బైక్ ర్యాలీకి తరలిరావాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి18: పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు శివాజీ ఉత్సవ కమిటీ నవనాథపురం ఆర్మూర్ సభ్యులు ఆదివారం తెలిపారు. సాయంత్రం 5గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, యువకులు తరలి రావాలని శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న పూజలు

హోమం నిర్వహిస్తున్న పండితులు

శక్కనగర్, ఫిబ్రవరి 18: బోధన్ పట్టణంలోని ప్రముఖ మారుతి మందిరంలో నూతన నవగ్రహ మండప నిర్మాణానికి ఆదివారం పూజలు నిర్వహించారు. గతంలో ఉన్న నవగ్రహ మండపం తొలగించడానికి నవగ్రహ, ఆగోర, శాంతిహోమాలను నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ నెట్టూరి వామనావదాని పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగించారు.

ప్రమాదకరంగా రహదారులు

- బోధన్ పట్టణంలో కూలిన కల్వర్టులు, కుంగిన రోడ్లు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

బైపాస్ రహదారిలో మూలమలుపు వద్ద ప్రమాదకరంగా చెరువు అలుగు కల్వర్టు

బోధన్ పట్టణంలోని నర్సాపూర్ నుంచి శక్కర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో కూలిన కల్వర్టు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 18: బోధన్ పట్టణంలోని రెండు వార్డుల్లో ఉన్న రహదారుల్లో కల్వర్టులు కూలి, వాటిపై ఉన్న రహదారి కుంగి ప్రమాదకరంగా మారాయి. నర్సాపూర్ నుంచి శక్కర్‌నగర్‌కు వెళ్లే రహదారిలో రాంనగర్ వద్ద, శక్కర్‌నగర్ చౌరస్తా నుంచి తట్టికోట్‌కు వెళ్లే రహదారిలో మరో వంతెన కూలిపోయింది. వానకాలం తట్టికోట్ రహదారిలో నీరు రోడ్డుపై నుంచి పారడంతో ప్రమాదకరంగా మారుతోంది. రోడ్డుపై రాకపోకలను నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రహదారుల్లో వంతెనలకు పక్కన రోడ్డు కొట్టుకుపోయింది. దగ్గరకు వచ్చే వరకు అవి కనిపించడం లేదని, ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బోధన్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే బైపాస్ రోడ్డులో పాండు చెరువు అలుగు వద్ద వంతెన సైడ్‌వాల్ కూలిపోయింది. అక్కడే మూలమలుపు ఉండడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది
నేను అనగా GIREDDY ABHILASH S/o. GIREDDY ASHOK R/o.H.No.6-16-246, అంబెడ్కర్ కాలనీ, సుభాష్‌నగర్, నిజామాబాద్. (New) H.No.3-105, గుండారం (V), మం॥ జి॥ నిజామాబాద్. నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. F1364804 గలది. తేది: 12.02.2024 మా ఇల్లు మారుతున్నప్పుడు పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించగలరు. సెల్ నెం: 99484 84545.

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చ